క్లుప్తంగా

బోర్‌వెల్ వాహనాన్ని సీజ్ చేసిన తహసీల్దార్

మణుగూరురూరల్: నిబంధనలను అతిక్రమిస్తూ ఓ ఇంట్లో బోర్ వేస్తుండగా.. మంగళవారం మణుగూరు తహసీల్దార్ కె.నాగరాజు ఆ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేశారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనే ఉన్న ఓ ఇంటి యజమాని కళాశాల ప్రహరీని కూల్చివేసి బోర్ వేయించాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ నాగరాజు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఇంటి యజమానిపై, బోర్‌వెల్ నిర్వాహకుడిపై ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినందుకు కేసు నమోదు చేశారు. బోర్‌వెల్‌ను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ టీపీసీసీ సభ్యులు, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి అన్నారు. మండల పరిధిలోని అల్లిగూడెం గ్రామంలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి రాహుల్ గాంధీ సందేశం ఉన్న కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు, కె.బాబురావు, ఎం.ధర్మరాజు, ఎం.గోపాలస్వామి, నారం జ్యోతి, కొర్సా గీత పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ములకలపల్లి: రాస్తారోకో చేస్తున్న మొండికర్రె గ్రామస్తులు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా సింగరేణి పునరావాస గ్రామం కొత్తకొండాపురం గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామ ప్రజలతో కలిసి ఇఫ్టూ నేత ఎస్‌డీ.నాజర్ పాషా ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాజర్ పాషా మాట్లాడుతూ.. పునరావాస గ్రామమైన కొత్తకొండాపురంలో సుమారు 70 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఇప్పటివరకు తాగునీటితోపాటు సీసీరోడ్లు, హిందూ శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి తాగునీటి కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కాటిబోయిన నరసింహారావు, శ్రీనివాస్, పాపారావు, రవి, ఇందు, వెంకటరమణ, నాగస్వరూప, గౌరి, సరోజని, అమ్ములమ్మ, నరసమ్మలు పాల్గొన్నారు.

గ్రామస్తుల రాస్తారోకో..

ములకలపల్లి: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చౌటిగూడెం జీపీ మొండికర్రె గ్రామస్తులు రోడ్డెక్కారు. ఖాళీబిందెలతో రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు నిమ్మల మధు మాట్లాడారు. గ్రామంలో గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మోటారు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే తాగునీటి ఎద్దడిని నివారించి. సమస్య పరిష్కరించాలని కోరారు.

బొడ్రాయి వార్షికోత్సవం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి మంగళవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బొడ్రాయి వద్ద అర్చకుల సమక్షంలో వివిధ రకాల పూజలు చేయగా, మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రదక్షణలు చేసి పూజలు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ సున్నం సరస్వతి, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్.వరలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వర్లు, వెంకన్న, చెన్నారావు పాల్గొన్నారు.

బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద కమలాపురం గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇల్లు కాలి సర్వం కోల్పోయిన కంగాల నాగరాజు, కంగాల వీరయ్య కుటుంబాలకు బీఆర్ఎస్ మండల బృందం పరామర్శించి బియ్యం, వంట గిన్నెలను వితరణగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు కణితి రాముడు, జానీపాషా, మోతుకూరి శ్రీకాంత్, జిలకర గంగరాజు, పోడియం సుబ్బారావు, పూనెం సురేష్, లీగల్ అడ్వైజర్ కొత్త మల్లేశ్వరరావు, సోయం కష్ణబాబు పాల్గొన్నారు.

హరితహారానికి ఎండదెబ్బ

- ఎండల ధాటికి వడలుతున్న మొక్కలు
- కాపాడుకునేందుకు నర్సరీ నిర్వాహకుల విఫలయత్నం
- ప్రత్యామ్నాయ చర్యలపై అధికారుల దృష్టి



ఎండల తీవ్రతకు వడలిపోతున్న నర్సరీలోని మొక్కలు



గ్రీన్ షెడ్ నెట్ల కింద మొక్కలను సంరక్షిస్తున్న కూలీలు

బూర్గంపాడు: ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు జీవజాలం అల్లాడిపోతోంది. హరితహారం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల వరకు అకాల వర్షాలతో కళకళలాడిన హరితహారం నర్సరీలు ఇప్పుడు వడలిపోతున్నాయి.ఎండలు తీవ్రత పెరిగిపోవటంతో మొక్కలపై తీవ్రప్రభావం చూపుతుంది. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటుతున్నాయి. దీంతో నర్సరీలలోని మొక్కలపై ఎండల తీవ్రతను చూపుతున్నాయి. నర్సరీలలోని మొక్కలను ఎండల తీవ్రత నుంచి కాపాడుకునేందుకు గ్రీన్ షెడ్ నెట్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆ నెట్స్ కూడా ఎండల తీవ్రతను ఆపలేకపోతున్నాయి. ఎండల తీవ్రతకు కొన్ని నర్సరీలలో మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలను కాపాడేందుకు నర్సరీల నిర్వహకులు ఎక్కువసార్లు వాటరింగ్ చేస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. నర్సరీలలో పెంచుతున్న పండ్లమొక్కలు, కూరజాతి మొక్కలు ఎండల తీవ్రతను తట్టుకోలేకపోతున్నాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయలపై దృష్టి పెడుతున్నారు. ఎండిపోయిన మొక్కలస్థానంలో వేరే మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిమ్మ, జామ, మునగ మొక్కలు పెంచేందుకు విత్తనాలను సిద్ధం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిఏటా వానాకాలంలో గ్రామాల్లో హరితహారం కింద మొక్కలు నాటుతుంది. ఇందుకోసం గతంలో ప్రైవేటు నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేసేది. మొక్కల కొనుగోలుకు గ్రామపంచాయతీలపై ఆర్థికభారం పడుతుండటంతో ప్రభుత్వం అన్ని గ్రామాలలో నర్సరీల నిర్వహణ చేపట్టింది. ఇందుకోసం గ్రామాల్లో ఐదేళ్ల క్రితం గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీల నిర్వహణను చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి కొంతమేరా నిధులు కేటాయించింది. రోడ్లవెంబడి, ప్రభుత్వ కార్యాలయాల్లో, పొలాల గట్ల వెంబడి, వాగులు, వంకలలో మొక్కలు నాటేందుకు ఈ నర్సరీలలో పెంచిన మొక్కలను వినియోగిస్తున్నారు. గ్రామాల్లో కోతుల తీవ్రత పెరుగుతుండటంతో హరితహారంలో పండ్ల మొక్కలు కూడా నాటుతున్నారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు అన్ని గ్రామపంచాయతీలకు ప్రభుత్వం వాటర్ ట్యాంకర్లను కూడా కొనుగోలు చేయించింది. వేసవిలో మొక్కలకు ప్రతిరోజు నీరు పడుతు, వాటి సంరక్షణకు చుట్టు కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా హరితహారంలో నాటిన మొక్కలు కూడా కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల మొక్కలు వడలిపోతున్నాయి.

మొక్కల సంరక్షణకు చర్యలు



ఎండల తీవ్రతకు హరితహారం నర్సరీలలో మొక్కలపై ప్రభావం పడుతోంది. వాటి సంరక్షణకు నర్సరీల్లో గ్రీన్ షెడ్ నెట్లు వేసి నీడను ఏర్పాటు చేశాం. పంచాయతీల వాటర్ ట్యాంకర్ల సహాయంతో ఎక్కువసార్లు వాటరింగ్ చేయిస్తున్నాం. ఇతర ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

– వివేక్‌రామ్, ఎంపీడీఓ, బూర్గంపాడు

పనివేళల్లో మార్పు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో సింగరేణి కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పీవీకాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి రక్షణ చర్యలు తీసుకోవాలని, ఎండలకు కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. గనుల వద్ద వార్డ్‌బాయ్, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో నాయకులు శివయ్య, సురేందర్, నాగరాజు, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి: సీఐటీయూ

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా కార్మికుల రక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీవ్రమైన ఎండలకు కార్మికులు ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో నాయకులు ఈశ్వరరావు, రామ్మూర్తి, లక్ష్మణరావు, ప్రభాకర్‌రావు, విల్సన్‌రాజు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిని నివారిద్దాం



అన్నపురెడ్డిపల్లి: ఎర్రగుంటలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ అంతం– మనందరి పంతం అనే నినాదం చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. డెంగ్యూ జ్వరాలు వ్యాపించేందుకు దోమలే ప్రధాన కారణమని, వీటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. దోమల నివారణ, పాటించాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత గురించి ఆయా గ్రామస్తులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: అవగాహన ర్యాలీ..



మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



చండ్రుగొండలో..



గుండాల సెంటర్‌లో..



ములకలపల్లిలో..



భద్రాచలంటౌన్: పట్టణంలో ర్యాలీ..

ఎస్సై బాధ్యతల స్వీకరణ

దమ్మపేట: దుమ్ముగూడెం నుంచి బదిలీపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్సై రవికుమార్ సోమవారం రాత్రి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు దమ్మపేట స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న శ్రావణ్‌కుమార్, రవికుమార్‌కు మిఠాయి తినిపించి, బాధ్యతలు అప్పగించారు.

కానిస్టేబుల్‌కు అభినందన

దమ్మపేట: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బ్లూకోర్టులో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ వినీత్ అభినందించారు. సోమవారం రాత్రి ఎస్పీ వినీత్, దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ శ్రీరామకృష్ణారెడ్డిని బ్లూకోర్టులో సక్రమంగా విధులు నిర్వర్తించినందుకు గాను రూ.2000ల నగదు రివార్డును అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని సిబ్బంది కానిస్టేబుల్‌కు అభినందనలు తెలిపారు.

సమ్మర్ సైన్స్ క్యాంప్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం భూపతిరావు కాలనీలోని జ్యోతి ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మర్ సైన్స్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. జిల్లాలో భద్రాచలం, బూర్గంపాడు, పాల్వంచ మండలాలలో వేసవి సైన్స్ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 6 నుంచి 10 తగరగతి విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఫన్ సైన్స్, కిచెన్ కెమిస్ట్రీ, సైన్స్ ప్రయోగాలు నేర్పింస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రగళ్ల సాయి నాగరాజు, సుబ్బారావు, వెంకట్, సునిల్, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని త్రివేణి పాఠశాలలో పది ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే పొదెం వీరయ్య మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, బాబురావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం

మణుగూరురూరల్: మండల పరిధిలోని లంక మల్లారం గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, జి.రమేష్, రాము, రవీందర్, గోపి, వెంకన్న, నరసయ్య, నర్సిరత్నం, ధనమ్మ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అన్నపురెడ్డిపల్లి: నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

సీసీ రోడ్ల నిర్మాణమే లక్ష్యం



వినాయకపురంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రాధాన్యత క్రమంలో సీసీ వీటిని నిర్మిస్తున్నామని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అచ్యుతాపురం, మద్దికొండ, కేశప్పగూడెం, వినాయకపురం, దబ్బతోగు కాలనీ, ఆసుపాక కాలనీ, ఊసిర్లగూడెం, తిరుమలకుంట, సుద్దగోతులగూడెం గ్రామాల్లో రూ.కోటి 65లక్షల వ్యయంతో నిర్మించిన 18 సీసీ రోడ్లను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు, వర్గాలకు అతీతంగా అన్ని చోట్లా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని తక్షణమే వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కేశప్పగూడెం గ్రామంలో నిర్మించిన డబుల్ ఇళ్లకు నేటికి విద్యుత్ మీటర్లు, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇవ్వలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. తక్షణమే ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. రాజానగరం, సుద్దగోతులగూడెం గ్రామాల్లో తాగునీటికు అవస్థలు పడుతున్నామని, ట్యాంకు నిర్మించాలని కోరారు. ఈ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా సుద్దగోతులగూడెం గ్రామంలో కల్వర్టు నుంచి పాఠశాల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు వినతి చేయగా.. ఇప్పటికే రహదారి నిర్మాణానికి రూ.18లక్షలు మంజూరైనట్లు, త్వరలోనే పనులు చేపడుతామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సీహెచ్ వరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ లూథరస్ విల్సన్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ కృష్ణయ్య, డీఈఈ సలీం, పీఆర్ ఏఈ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, జేకేవీ రమణారావు, బిర్రం వెంకటేశ్వర్లు, కాసాని చంద్రమోహన్, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

కరకగూడెం: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ ఆదర్శ పాలన కొనసాగిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని అనంతారం, కొత్తగూడెం, భట్టుపల్లి, సమత్ మోతె, వట్టంవారి గుంపు, చిరుమళ్ల, పద్మాపురం, వెంకటాపురం, రేగుళ్ల, రేగళ్ల కన్నాయిగూడెం గ్రామపంచాయతీల్లో సుమారు రూ.90 లక్షల రూపాయల వ్యయంతో 53 సీసీ రోడ్ల పనులకు స్థానిక నాయకులతో శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. అనంతరం కరకగూడెంలో దళితబంధు పథకం ద్వారా మంజూరైన లబ్ధిదారుడి డిజిటల్ స్టూడియోను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నాయకులు

మణుగూరురూరల్: ఈ నెల 29వ తేదీన ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు మంగళవారం జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మణుగూరు వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, తరుణ్‌రెడ్డి, వీరంకి వెంకట్రావు, నాయకులు టీవీ సుబ్బారెడ్డి, పల్లపు తిరుమలేష్, కటుకూరి శ్రీనివాసరావు, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధుకుమార్, కుంజా నాగేశ్వరరావు, ఆర్‌కె.రాము, రాజేంద్రప్రసాద్, నాగేంద్రబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

మండలంలోని సమితిసింగారం గ్రామానికి చెందిన రావణ్ యూత్ సభ్యులకు పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరుణ్‌రెడ్డి, వెంకన్న, మధుకుమార్, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు ముంతకు సంచులే రక్ష!



కల్లు కుండలకు ఖాళీ సంచులను రక్షణగా తొడిగిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: అసలే వేసవి కాలం..ఏజెన్సీ ప్రాంతంలో కల్లు ముంతకు డిమాండ్ అధికం. దాంతో ఈ కల్లు ముంతల రక్షణకు కల్లు గీసే వారు వినూత్నంగా ఆలోచిస్తుంటారు. దీనిని నిదర్శనమే ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం. అశ్వారావుపేట మండల నందిపాడు గ్రామంలో వందల సంఖ్యలో తాటి చెట్లు ఉంటాయి. వీటిలో కల్లు గీసే చెట్లకు మట్టి కుండలు పెట్టి కల్లు సేకరిస్తుంటారు. అయితే కల్లు సేకరణ కోసం పెట్టే మట్టి కుండల్లో నుంచి వేసవి తాపానికి వివిధ రకాల పక్షులు, ఒకొక్క సారి విషసర్పాలు సైతం కల్లు తాగి తమ దాహార్తిని తీర్చుకోవడం సహజమే. అలాగే అకతాయి యువకులు తాటి చెట్లకు ఉంచే కల్లు కుండలను రాళ్లతో కొట్టి కల్లు తాగుతుంటారు. ఈ నేపథ్యంలోనే పక్షులు, అకతాయిల బారి నుంచి కల్లును రక్షించుకునేందుకు ఓ గీత కార్మికుడు భిన్నంగా ఆలోచించి మట్టి కుండలకు ఖాళీ సంచులు తొడిగి, వాటికి రక్షణగా పెట్టాడు. ఈ దృశ్యాన్ని మంగళవారం 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

సీఎం కప్ పోటీలు ప్రారంభం



కరకగూడెం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ కాంతారావు

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ రేగా కాళికతో కలిసి ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మంగళవారం ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: సీఎం కప్ క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. దమ్మపేట గ్రామంలోని గిరిజన గురుకుల క్రీడా ప్రాంగణంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. యువకులతో కాసేపు సరదాగా వాలీబాల్ ఆడారు. జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, దారా యుగంధర్, సర్పంచులు సుగుణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: సీఎం కప్ పోటీలను ఆళ్లపల్లి, గుండాల మండల కేంద్రాల్లో ఎంపీపీలు కొండ్రు మంజు భార్గవి, ముక్తి సత్యం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సత్యనారాయణ, రామారావు, తహసీల్దార్ నాగదివ్య, సాదియా సుల్తానా, ఎస్సైలు రాజశేఖర్, రతీష్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా మైదానంలో పోటీలను ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్ పోటీలను నిర్వహించగా, ఈ క్రీడా పోటీలను స్థానిక ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య పర్యవేక్షించారు.

పినపాక: మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ పోటీలను ఎంపీపీ గుమ్మడి గాంధీ మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఎస్సై నాగుల్ మీరా, సర్పంచ్‌లు సునీల్, కృష్ణంరాజు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సీఎం కప్ క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ డి.శ్రీను, స్థానిక సర్పంచ్ బీబినేని వీరభద్రం రిబ్బన్ కట్‌చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. వైస్‌ఎంపీపీ కొడుమూరి పుల్లారావు, ఎంపీటీసీ మెహరమణి, ఎంపీఓ లక్ష్మయ్య, హెచ్‌ఎం బాబా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోటీలు

చండ్రుగొండ: సీఎం కప్ క్రీడలు మండలకేంద్రం చండ్రుగొండలో రెండోరోజు మంగళవారం కొనసాగాయి. వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరిగా సాగాయి. ఎంపీడీఓ జి.రేవతి, ఎంఈఓ ఎస్.సత్యనారాయణ పోటీలను పర్యవేక్షించారు.